

25న సర్టిఫికెట్ వెరిఫికేషన్

మెగా డిఎస్‌సి-2025 అభ్యర్థులు హాజరవ్వాలి : డిఇఒ

ఏలూరు అర్బన్ : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మెగా డిఎస్‌సి-2025కు సంబంధించి వివిధ కేటగిరి పోస్టులకు అభ్యర్థులు వారి వారి లాగిన్ ద్వారా మెరిట్ లిస్ట్ కాపీని డౌన్‌లోడ్ చేసుకుని ఈనెల 25వ తేదీన వట్లూరులోని సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలని డిఇఒ ఎం.వెంకట లక్ష్మమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వారి ఎస్‌ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, పీజీ, బిఇడి, డిఇడి, బిపిఇడి, పండిట్ ట్రైనింగ్ సర్టిఫికెట్లతో పాటు కుల ధ్రువీకరణ పత్రం, డిజెబిలిటీ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్, టెట్ మార్కుల కాపీ, డిఎస్‌సి హాల్ టికెట్ కాపీ, ఐదు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు వచ్చేప్పుడు మూడు సెట్ల అటెస్టెడ్ కాపీలు, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని తెలిపారు.

యూరియాపై సర్కార్ దొంగాట..!



పోలవరం మండలం గూటాలలో సొసైటీ వద్ద బారులు తీరిన రైతులు

సరిపడా నిల్వలు లేకపోయినా ఉన్నట్లు ప్రచారం

రైతుల నెత్తిపై నానో యూరియా రుద్దేందుకు కుట్ర

నానో యూరియా అమ్మకాలపై సహకార సంఘాలకు టార్గెట్లు

యూరియా కోసం సహకార సంఘాల వద్ద రైతుల పడిగాపులు

నానో యూరియాతో కలిపి సరఫరా లెక్కలు చెబుతున్న పరిస్థితి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రైతులు వినియోగించే ప్రధాన ఎరువు యూరియాపై ప్రభుత్వం దొంగాట ఆడుతోంది. సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని అధికారులు చెబుతున్న మాటలకు.. క్షేత్రస్థాయి పరిస్థితులకు సంబంధం లేకుండాపోయింది. పోలవరం మండలం గూటాల సహకార సంఘం వద్ద శుక్రవారం యూరియా కోసం రైతులు పడిగాపులు పడుతున్న ఘటనే అందుకు నిదర్శనం. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోనూ యూరియా కోసం రైతుల ఇబ్బందులు రోజురోజుకీ పెరుగుతున్న పరిస్థితి కన్పిస్తోంది. కేంద్ర ప్రభుత్వ ఒత్తిడితో నానో యూరియాను రైతులకు అంటగట్టే ఉద్దేశంతోనే ప్రభుత్వం యూరియా కొరత సృష్టిస్తుందని రైతుల్లో చర్చ సాగుతోంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు నాలుగున్నర లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగుతోపాటు ఇతర పంటలను సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌లో ఏలూరు జిల్లాకు 33,762 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అంచనా వేయగా, పశ్చిమగోదావరి జిల్లాకు 21,270 మెట్రిక్ టన్నులు అవసరమని తేల్చారు. ఏలూరు జిల్లాలో ఆగస్టు నెలకు 10,183 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవ్వగా, గడిచిన 16వ తేదీ నాటికి జిల్లాకు 5,496 మెట్రిక్ టన్నుల యూరియా చేరినట్లు చెబుతున్నారు. యూరియా సరిపడా వస్తుందని అధికారులు చెబుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 18 వేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు చేరినట్లు చెప్పుకొస్తున్నారు. అయితే అధికారులు చెబుతున్న లెక్కలకు, క్షేత్రస్థాయి పరిస్థితులకు సంబంధం లేకుండాపోయింది. యూరియా కోసం రైతులు సహకార సంఘాల వద్ద పడిగాపులు పడితే తప్ప అందని పరిస్థితి నెలకొంది. యూరియాపై ఇచ్చే సబ్సిడీని తగ్గించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నానో యూరియా అమ్మకాలను పెంచాలని రాష్ట్రాలపై ఒత్తిడి తీసుకొస్తోంది. దీంతో యూరియా విక్రయిస్తున్న సహకార సంఘాలకు ప్రభుత్వం టార్గెట్లు పెట్టింది. సహకార సంఘాల్లో నానో యూరియాను కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారు.

నానో యూరియాతో కలిపి లెక్కలు చెబుతున్నారా..?

ప్రభుత్వం 25 శాతం నానో యూరియా, 75 శాతం యూరియా ఉపయోగిస్తున్నట్లు చెబుతున్నా అందులో నిజం లేకుండాపోయింది. క్షేత్రస్థాయిలో మాత్రం అధికంగా నానో యూరియా అమ్మకాలు చేసేలా వ్యవహారం సాగిస్తోంది. యూరియా కొరత సృష్టించి నానో యూరియాను రైతుల నెత్తిన రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. పోలవరం మండలం గూటాలలో 1600 ఎకరాల వరకూ వ్యవసాయ సాగు ఉంది. రెండో కోటా ఎరువు వేయాల్సి ఉంది. ఇప్పటి వరకూ 250 బస్తాల యూరియా మాత్రమే సరఫరా జరిగింది. దీంతో రైతులు యూరియా కోసం బారులు తీరి పడిగాపులు పడుతున్నారు. అధికారులు మాత్రం 650 లీటర్ల నానో యూరియా ఉందని, రైతులకు యూరియా కొరత లేదని చెబుతున్నారు. అంటే నానో యూరియా లెక్కలతో కలిపి యూరియా నిల్వలు సరిపడా ఉన్నట్లు అధికారులు చెబుతున్నట్లు తెలుస్తోంది. నానో యూరియా వాడేందుకు రైతులు ముందుకు రావడం లేదు. దీంతో యూరియా సమస్య రోజురోజుకీ తీవ్రతరమవుతోంది. నానో యూరియా వల్ల పెద్దగా ఉపయోగం ఉండటం లేదని రైతులు చెబుతున్నారు. అలాంటప్పుడు బలవంతంగా నానో యూరియాను రైతులకు ఏవిధంగా అంటగడుతున్నారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం యూరియా నిల్వలపై దొంగాట ఆడుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రైతులకు సరిపడా యూరియా అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.




వేలేరుపాడులోని మార్కెట్‌లో ఇంటి ఆవరణలోకి చేరిన వరద నీరు

గోదావరి వరద తగ్గుముఖం

రహదారులను వీడని ముంపు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

వారం రోజులుగా క్రమంగా పెరుగుతూ వచ్చిన గోదావరి వరద శుక్రవారం తగ్గుముఖం పట్టింది. భద్రాచలంలో గోదావరి నీటిమట్టం 52 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. ప్రస్తుతం అక్కడ గోదావరి నీటిమట్టం 44 అడుగులుగా ఉంది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. గోదావరి వరద తగ్గినా ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటం, ప్రాజెక్టుల్లో సామర్థ్యానికి మించి ఉన్న నీటిని దిగువకు వదులుతుండటంతో మళ్లీ గోదావరి వరద పెరుగుతుందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించడంతో విలీన మండలాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వారం రోజులుగా దాచారం-కుక్కునూరు మధ్య గుండేటి వాగుపై గల కాజ్‌వే, ముత్యాలంపాడు, వింజరం మధ్య పాలవాగుపై గల కాజ్‌వే వరద ముంపునకు గురవ్వడంతో 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు, వ్యాపారులు, రైతులు, రోగులు మండల కేంద్రానికి రావాలంటే చుట్టూ 15 కిలోమీటర్లు తిరిగి రావాల్సి వస్తోంది. అయితే శ్రీధర సీతారామ నగరం-వెంకటాపురం మధ్య వెంకటాపురం ఎస్‌సి కాలనీ వద్ద ప్రధాన రహదారి, కుక్కునూరు-భద్రాచలం మధ్య ప్రధాన రహదారి ముంపు నుండి బయట పడటంతో రాకపోకలు పున:ప్రారంభమయ్యాయి. వరద తగ్గుముఖం పట్టడంతో జనం కొంత ఊపిరి పీల్చుకున్నారు.



కుక్కునూరు: ముంపులోనే గుండేటి వాగు కాజ్‌వే

వేలేరుపాడు రూరల్: గోదావరి వరద తగ్గుముఖం పట్టడంతో మండలంలోని ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నారు. అయితే మళ్లీ వరద పెరిగే అవకాశం ఉందనడంతో ఏం చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికీ రుద్రంకోట, రేపాకగొమ్ము, తాట్కూరుగొమ్ము, కోయిదా వెళ్లే మార్గాల్లో నాల్లవరం, చాగరపల్లి, కన్నాయిగుట్ట తదితర ప్రధాన రహదారులన్నీ వరద ఉధృతికి నీటమునిగి సుమారు 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అర్హులైన పేదలందరికీ మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన పంగిడిగూడెంలో గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిపిఎం నాయకులు ఎం.అశోక్‌కుమార్ అధ్యక్షత వహించగా, మండల కార్యదర్శి ఎం.జీవరత్నం మాట్లాడారు. గ్రామంలోని 90 కుటుంబాలు ఇళ్ల స్థలాలు లేక అద్దె ఇళ్లలో నివాసముంటున్నాయని, ఒకే ఇంట్లో మూడు, నాలుగు కుటుంబాలు నివాసం ఉండాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇళ్ల స్థలాలివ్వాలని నాలుగు సంవత్సరాలుగా దరఖాస్తులు పెట్టినా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఈ సమస్యపై సిపిఎం ఆధ్వర్యాన పలు దఫాలు ఆందోళన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికి నాలుగుసార్లు దరఖాస్తులు పెట్టారని, ప్రతిసారీ ఆన్‌లైన్ పట్టాలిస్తామని చెబుతున్నారే తప్ప కార్యరూపం దాల్చడం లేదని అన్నారు. ఇది ముమ్మాటికి ప్రభుత్వం, అధికారులకు పేదల పట్ల ఉన్న చిన్న చూపేనని విమర్శించారు. గ్రామ సచివాలయ కార్యదర్శి, విఆర్‌ఒకు అనేకసార్లు దరఖాస్తులు అందజేసినట్లు చెప్పారు. తక్షణమే ఈ సమస్య పరిష్కరించి పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, లేనిపక్షంలో పేదల ఆధ్వర్యాన ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో ఎం సురేష్, కె.సుబ్బారావు, గుదే బాలయ్య, పెండెం బజార్, పి.ఘటోత్కచుడు, గోసాల మరియమ్మ, సింహాద్రి నాగమణి, కె.శాంతకుమారి, జి.మంగతాయారు, దున్న పాపమ్మ, కె.కుమారి పాల్గొన్నారు.



ధర్నాలో నినదిస్తున్న పేదలు, నేతలు

'స్త్రీ శక్తి'తో 2.60 లక్షల మహిళలకు లబ్ధి : డిటిఒ

నూజివీడు టౌన్ : ఎపిఎస్‌ఆర్‌టిసి జిల్లా పరిధిలో ఉన్న 309 బస్సుల్లో 177 బస్సులను స్త్రీ శక్తి పథకం కోసం వినియోగిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి షబ్నం చెప్పారు. శుక్రవారం నూజివీడు వచ్చిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 63 రూట్లలో 2.60 లక్షల మంది మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. 93.49 లక్షలు వారికి ఆదా అయినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా బస్సు సర్వీసులు పెంచేందుకు దృష్టి పెడుతున్నామని తెలిపారు.



నా పేరు కొమ్ము సుభద్ర, టి.నరసాపురం మండలం కె.జగ్గవరం గ్రామం. నా భర్త ప్రభాకరరావు పామాయిల్ కార్మికునిగా పని చేసేవాడు. పామాయిల్ తోటల్లో గెలలు నరికేందుకు వెళ్లేవాడు. గత జులై 29వ తేదీ పామాయిల్ తోటలో గెలలు కోస్తూ విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. మా కుటుంబానికి ఆయనే జీవనాధారం. నా భర్త మృతి చెందడంతో మా కుటుంబ పరిస్థితి అధ్వానంగా మారింది. ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయమూ అందలేదు. విద్యుత్ శాఖాధికారులతో సహా ఏఒక్కరూ పట్టించుకోవడం లేదు.



నా పేరు తడికమళ్ల చుక్కమ్మ, జీలుగుమిల్లి మండలం స్వర్ణవారిగూడెం పంచాయతీ. నా భర్త రమేష్ ఈ నెల ఎనిమిదో తేదీన జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి పంచాయతీ పరిధిలో పామాయిల్ గెలలు నరకడానికి వెళ్లాడు. గెలలు కోస్తుండగా విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. మాకు ఒక పాప, ఆయన చనిపోవడంతో ఇంటికి పెద్దదిక్కును కోల్పోయాం. ప్రభుత్వం నుంచిగానీ, విద్యుత్ శాఖ నుంచిగానీ ఎటువంటి సాయమూ అందలేదు. ఆర్థిక సాయం అందించి మా కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకుంటున్నాను.

ప్రాణాలు పోతున్నా.. పట్టదా..!

పామాయిల్ గెలలు కోస్తూ మూడు నెలల్లో విద్యుత్ షాక్‌తో ఆరుగురు మృతి

గతేడాది 12 మంది దుర్మరణం

కనీసం పట్టించుకోని విద్యుత్ శాఖాధికారులు

రోడ్డున పడ్డ కార్మికుల కుటుంబాలు

ప్రభుత్వం నుంచి కనీస సాయం కరువు

స్పందించని ప్రజాప్రతినిధులు, అధికారులు

జిల్లాలో 12 వేల మందికిపైగా పామాయిల్ కార్మికులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న సుభద్ర, చుక్కమ్మ మాత్రమే కాదు.. గడిచిన 15 నెలల కాలంలో జిల్లావ్యాప్తంగా 18 మంది పామాయిల్ కార్మికుల తోటల్లో గెలలు కోస్తుండగా విద్యుత్ షాక్ తగిలి మృత్యువాత పడ్డారు. గడిచిన మూడు నెలల్లోనే ఏకంగా ఆరుగురు కార్మికులు చనిపోయారు. పామాయిల్ తోటల్లో గెలలు కోయడానికి వెళ్లి విద్యుత్ షాక్‌తో కార్మికులు పిట్టల్లా రాలిపోతున్నా జిల్లాలోని ప్రజాప్రతినిధులకుగాని, అధికారులకుగాని చీమ కుట్టినట్లు కూడా లేకుండాపోయింది. నిరుపేద కుటుంబాలకు చెందిన పామాయిల్ కార్మికుల ప్రాణాలంటే ఏమాత్రం లెక్కలేని పరిస్థితి కన్పిస్తోంది. ఏలూరు జిల్లావ్యాప్తంగా దాదాపు లక్షా 45 వేల ఎకరాల్లో పామాయిల్ సాగవుతోంది. రాష్ట్రంలోనే పామాయిల్ సాగు ఎక్కువగా సాగుతున్న జిల్లాల్లో ఏలూరుదే ప్రథమస్థానం. పామాయిల్ సాగును మరింత పెంచాలని ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఉద్యాన శాఖ సైతం అందుకు సంబంధించిన ప్రణాళికలు రచించి ముందుకు సాగుతోంది. పామాయిల్ సాగులో కీలక పాత్ర పోషించే కార్మికుల గురించి పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. జిల్లావ్యాప్తంగా 12 వేల మందికిపైగా పామాయిల్ కార్మికులు పని చేస్తున్నారు. వీరికి సరైన గుర్తింపు లేని పరిస్థితి ఉంది. ప్రభుత్వానికి పెద్దఎత్తున ఆదాయం సమకూర్చే పామాయిల్ సాగులో తోట చెలపడం దగ్గర నుంచి గెలలు కోయడం, వాటిని వాహనాలపైకి ఎక్కించి ఫ్యాక్టరీకి తరలించడంతో సహా అన్ని పనులూ పామాయిల్ కార్మికులే చేస్తారు. రోజంతా పని చేస్తే రూ.ఏడొందలు రావడమే గగనం. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలు వారివి. పామాయిల్ తోటల పైనుంచి వెళ్లే హైటెన్షన్ విద్యుత్ తీగలు పామాయిల్ కార్మికుల పాలిట మృత్యుపాశాలుగా మారాయి. తోటలో గెలలు కోసేటప్పుడు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయకపోవడంతో కార్మికులు పెద్దఎత్తున చనిపోతున్నారు. దీంతో ఇంటి పెద్ద దిక్కుని కోల్పోయి రోడ్డున పడుతున్న పరిస్థితి ఉంది. పామాయిల్ సాగులో కీలక భూమిక పోషిస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



మృతుడు రమేష్ (ఫైల్‌ఫొటో)

పామాయిల్ కార్మికుల గురించి పట్టని విద్యుత్‌శాఖ

పామాయిల్ గెలలు కోస్తూ విద్యుత్ షాక్‌తో చనిపోతున్న పామాయిల్ కార్మికుల గురించి విద్యుత్‌శాఖ ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. గెలలు కోసేటప్పుడు విద్యుత్ నిలుపుదల చేసేవిధంగా యజమానులు లేదా రైతులకు అవగాహన కల్పించడం లేదు. విద్యుత్‌షాక్‌తో చనిపోతున్న కార్మికుల కుటుంబాలకు ఆ శాఖ తరపున కనీస సాయం కూడా అందించడం లేదు. దీంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఉద్యానవన, కార్మిక శాఖలు సైతం పామాయిల్ కార్మికుల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఫ్యాక్టరీ యాజమాన్యాలు కార్మికుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. గెలలు కోసే కార్మికులకు భద్రతా చర్యల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కార్మికులకు ఇన్సూరెన్స్ వంటి సదుపాయాలు కల్పించడం లేదు. వీరిని అసలు కార్మికులుగానే గుర్తించని దుస్థితి ఉంది. దీంతో నిరుపేద కుటుంబాలకు చెందిన పామాయిల్ కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. జిల్లా సమీక్షా సమావేశాల్లో ప్రజాప్రతినిధులు సైతం పామాయిల్ కార్మికుల గురించి నోరువిప్పడం లేదు. ప్రభుత్వం వెంటనే పామాయిల్ కార్మికులను ఆదుకోవాలని జనం కోరుతున్నారు.

పామాయిల్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పి. రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

పామాయిల్ తోటల్లో పనిచేసే వారిని కార్మికులుగా గుర్తించాలి. ప్రమాద బీమా వంటివి కల్పించాలి. పామాయిల్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి. ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి. ఫ్యాక్టరీ యాజమాన్యం పనిముట్లు అందించేవిధంగా చర్యలు తీసుకోవాలి. చనిపోయిన కార్మికుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలి.

టిడిపి నేత అర్ధనగ్న ప్రదర్శన

పంచాయతీ పనుల టెండర్లలో అక్రమాలంటూ నిరసన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని గొల్లపల్లి గ్రామ సచివాలయం వద్ద టిడిపి సీనియర్ నేత పొట్లూరి సత్యనారాయణ శుక్రవారం అర్ధ నగ్న ప్రదర్శన చేపట్టి నిరసన తెలిపారు. పంచాయతీ పరిధిలో జరిగే పనుల టెండర్లలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించే వరకు తన ఆందోళన కొనసాగుతుందని సత్యనారాయణ స్పష్టం చేశారు.



అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న సత్యనారాయణ

నిర్వాసితులకు పూర్తిస్థాయి పునరావాసం కల్పించాలి


అర్హులందరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

గోదావరి వరద ముంపునకు శాశ్వత పరిష్కారం చూపాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తిస్థాయి పునరావాసం కల్పించాలని, అర్హులైన వారందరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, గోదావరి వరద ముంపునకు శాశ్వత పరిష్కారం చూపాలని సిపిఎం జిల్లా కమిటీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. ఈ అంశంపై ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి శుక్రవారం ఏలూరులో మీడియాతో మాట్లాడుతూ కేవలం వరదలు వచ్చినప్పుడే కాకుండా గోదావరి వరద ముంపునకు శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించాలని, అర్హులైన వారందరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏటా ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో గోదావరి వరద రావడం, ఆ సందర్భంగా తాత్కాలిక ఏర్పాట్లు చేసి చేతులు దులుపుకోవడం తప్ప రాష్ట్ర ప్రభుత్వానికి నిర్వాసితుల పట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు. వరదల సందర్భంగా అధికారులు ప్రజలను కాలనీలకు తరలించి చేతులు దులుపుకుంటున్నారన్నారు. కాలనీలో కనీస మౌలిక సౌకర్యాలు లేక నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు జాతీయ ప్రాజెక్టు అయినప్పటికీ దాని కోసం తమ జీవితాలు, బతుకులు త్యాగం చేసిన నిర్వాసితులను మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికొదిలేశాయని విమర్శించారు. నిర్వాసిత కాలనీలు నిర్మించి రెండేళ్లు పూర్తి కాకముందే వర్షాలు పడితే ఇళ్లు కారిపోయే పరిస్థితి ఉందని, కాలనీల్లో తాగునీరు, సరైన మరుగుదొడ్లు, వీధిలైట్లు లేక వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, దోమలతో అవస్థలు పడుతున్నారని తెలిపారు. వరదల సందర్భంగా కొండలు, గుట్టలు ఎక్కి ప్రాణాలు కాపాడుకునే ప్రజలకు ప్రభుత్వాలు కనీసం బరకాలు, కొవ్వొత్తులు అందించకపోవడం, బోట్ల ద్వారా ఆహార పదార్థాలు సరఫరా చేసి వారిని ఆదుకునే ప్రయత్నం చేయకపోవడం దారుణమన్నారు. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో వరద సందర్భంగా రవాణా సౌకర్యం లేక కొన్ని గ్రామాలతో సంబంధాలు ఉండడం లేదన్నారు. స్వచ్ఛంద సంస్థలు లేదా దాతలు సహాయక చర్యలు చేపట్టాలన్నా అవకాశం లేకుండా పోతుందని తెలిపారు. ఈ తరహా పరిస్థితి ప్రతి ఏటా ఉంటుందని, అయినా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రాజెక్ట్ కట్టడానికి ముందే పునరావాసం కల్పించాలని చట్టాలు ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని పట్టించుకోకుండా నిర్వాసితుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే నేడు ఈ దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అర్హులైన వారందరికీ సక్రమంగా ఇవ్వాలని, పూర్తిస్థాయి సౌకర్యాలతో పునరావాస కాలనీలు ఏర్పాటు చేయాలని, ప్రతి ఏటా వచ్చే గోదావరి వరద ముంపు నివారణకు శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అప్పుడే నిర్వాసితులకు తగిన న్యాయం జరుగుతుందని తెలిపారు.



ఉపాధ్యాయులను కలిసి మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమడోలు

తాను ఎంఎల్‌సిగా ఎన్నికయ్యేందుకు సహకరించిన ఉపాధ్యాయులకు ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి కృతజ్ఞతలు తెలిపారు. భీమడోలు మండలంలో ఆయన శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీ మాధురి జూనియర్ కళాశాలను సందర్శించారు. ఆయనతో పాటు సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు. కళాశాలకు చెందిన ప్రధాన ఆచార్యులు అశోక్, కేసరి, బాలు సందర్శనకు వచ్చిన ఎంఎల్‌సి బృందానికి స్వాగతం పలికారు. అనంతరం ఎంఎల్‌సి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సమస్యలు ఎదురైతే నేరుగా తనను సంప్రదించాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.


ప్రత్యేక కార్యాచరణ అమలుతో మరింత అభివృద్ధి

రైతు సేవా సహకార సంఘం పర్సన్ ఇన్‌ఛార్జి గన్ని వీరాంజనేయులు

సంఘ ప్రగతిపై సమీక్షా సమావేశం

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు రైతు సేవా సహకార సంఘం అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ పథకం రూపొందించి, అమలు చేయనున్నట్లు సంఘం పర్సన్ ఇన్‌ఛార్జి, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. సంఘ కార్యాలయంలో సంఘ ప్రగతిపై సమీక్షా సమావేశాన్ని శుక్రవారం ఆయన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిసిసిబి ముఖ్య కార్య నిర్వహణాధికారి సింహాచలం హాజరయ్యారు. త్రిసభ్య కమిటీ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన తర్వాత జరిగిన ప్రగతిని సంఘం సిఇఒ నాగేంద్ర వివరించారు. అనంతరం ఆప్కాబ్ ఛైర్మన్ మాట్లాడుతూ సంఘం ద్వారా బంగారం హామీపై రుణాలు అందించనున్నామన్నారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు అర్హత ప్రాతిపదికన సత్వరమే రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు పరపతిపై ఇచ్చే ఎరువుల రుణాలపై ప్రస్తుతం ఉన్న 16 శాతం ఉన్న రుణాలను 14 శాతానికి తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నేస్తం రుణాల కోసం దరఖాస్తుదారులందరికీ రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. త్రిసభ్య కమిటీ బాధ్యతలు స్వీకరించిన 24 రోజుల వ్యవధిలో రూ.58 లక్షలు రికవరీ సాధించినట్లు తెలిపారు. సంఘ పరిధిలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో త్రిసభ్య కమిటీ సభ్యులు వెజ్జు రాంబాబు, జి.శ్రీనివాస్, సంఘ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గన్ని వీరాంజనేయులు


ఉచిత బస్సు పథకం వల్ల నష్టపోయే ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఏలూరు పాత బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. (వార్త మెయిన్‌లో...)

రంగాపురం స్కూల్ పరిస్థితిపై వివరణ ఇవ్వాలి

విద్యాశాఖాధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి -ముదినేపల్లి

ప్రజాశక్తి కథనానికి కలెక్టర్ వెట్రిసెల్వి స్పందించారు. 'పేరుకే మోడల్‌స్కూల్.. ఆదరణ నిల్ అనే శీర్షికతో ప్రజాశక్తి దినపత్రికలో శుక్రవారం కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. ఈ కథనానికి కలెక్టర్ వెట్రిసెల్వి స్పందించి రంగాపురం స్కూల్ పరిస్థితిపై వివరణ ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మకు ఆదేశాలు వచ్చాయి. దీంతో రంగాపురం మోడల్ స్కూల్ పరిస్థితిపై విచారణ చేసి పూర్తిస్థాయి నివేదిక పంపాలని డిఇఒ కార్యాలయం నుంచి ముదినేపల్లి ఎంఇఒ-1 రామారావును ఆదేశించారు.

25 నుంచి రైల్వే గేటు మూసివేత

ప్రజాశక్తి - మండవల్లి

రైల్వే ట్రాక్ మరమ్మతుల నిమిత్తం మండవల్లి గన్నవరం రైల్వే గేట్‌ను మూసి వేస్తున్నామని సీనియర్ సెక్షన్ ఇంజినీర్ అబ్దుల్ రెహమాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండవల్లి నుంచి గన్నవరం వెళ్లేందుకు మధ్యలో ఉన్న ఎల్‌సి నెంబర్ 71 రైల్వే గేటు మరమ్మతులకు నోచుకుంటున్నారు. ఆ రైల్వే గేటు ప్రాంతంలో పూర్తిస్థాయిలో మరమ్మతులు నిర్వహించే విధంగా ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ ఒకటో తేదీ వరకు ఎనిమిది రోజుల పాటు మూస్తున్నట్లు తెలిపారు. మరమ్మతుల అనంతరం గేటును యథావిధిగా పునరుద్ధరిస్తామని తెలిపారు.

ఆర్‌జియుకెటిలో ఎక్యువిహెచ్-2025 బూట్‌క్యాంప్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడులో ఈ నెల 21, 22 తేదీల్లో రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో, అగ్రశ్రేణి టెక్నాలజీ భాగస్వాముల మద్దతుతో అఖిల భారత స్థాయి అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ (ఎక్యువిహెచ్)-2025 బూట్‌క్యాంప్" విజయవంతంగా నిర్వహించారు. రెండు రోజుల ఈ బూట్‌క్యాంపునకు భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక శాఖ, ఐబిఎం, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) వంటి ప్రతిష్టాత్మక సంస్థలు మద్దతు అందించాయి. వీరి భాగస్వామ్యం ద్వారా క్వాంటమ్ కంప్యూటింగ్‌లోని అగ్రగామి పరిజ్ఞానం, సమస్యల పరిష్కార పద్ధతులు, సృజనాత్మకతకు సంబంధించిన వ్యూహాలను విద్యార్థులు తెలుసుకునే అవకాశం కలిగింది.

శ్రీవెంకటేశ్వర కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - భీమడోలు

ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం పరిధిలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు నాలుగో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో 78 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్ తెలిపారు. సెమిస్టర్ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఈ సందర్భంగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్‌తో పాటు, కళాశాలను దత్తత తీసుకున్న ద్వారకాతిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయ ఇఒ ఎన్‌విఎస్ఎన్.మూర్తి అభినందించారు. కళాశాల నుంచి బిఎ పరీక్షలకు హాజరైన 23 మందిలో 21 మంది, బికాం పరీక్షలకు హాజరైన 25 మందిలో 17 మంది, బిఎస్‌సి పరీక్షలకు హాజరైన 11 మందిలో ఎనిమిది మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

ప్రజాశక్తి - మండవల్లి

ఇన్సూరెన్స్ పథకాలు మృతి చెందిన కుటుంబాల్లో ఆర్థిక భరోసాను కలుగ చేస్తాయని ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ రాజేష్ స్పష్టం చేశారు. స్థానిక ఇండియన్ బ్యాంకులో ఖాతాదారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్రమాదం సంభవించి భైరవపట్నానికి చెందిన చింతా శ్రీదేవి మరణించడంతో ఇండియన్ బ్యాంక్ రక్షక్ పథకం ద్వారా వచ్చిన రూ.20 లక్షల చెక్కును కూటమి నాయకులు చేపల దుర్గాప్రసాద్‌తో కలిసి నామిని భర్త సుబ్బారావుకు శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ మేనేజర్ కె.గోపాల్, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్.భాస్కరరావు, హనుమంత రామకృష్ణ, వెరిఫికేషన్ డిపార్ట్‌మెంట్ యశ్వంత్ చౌహాన్, ఎపి ఎం భరద్వాజ్, గుడివాడ గణేష్, సత్యనారాయణ రాజు, కిన్ని బాబు, ఖాతాదారులు, తదితరులు పాల్గొన్నారు.

బిఆర్‌సి యజమానులకు శిక్షణ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు సాధికార సంస్థ ద్వారా జాతీయ ప్రకృతి పద్ధతి వ్యవసాయం పథకం కింద బయో రిసోర్స్ సెంటర్ యజమానుల కోసం మొదటి రోజు శిక్షణా కార్యక్రమాన్ని గుండుగొలనుకుంట గ్రామంలోని బయో రిసోర్స్ సెంటర్‌లో వ్యవసాయ శాఖ ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్ వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఏలూరు సిటీ : ప్రభుత్వ ఉద్యోగులకు, సిబ్బందికి అన్నివిధాలా అండగా ఉండేందుకు కూటమి ప్రభుత్వాధినేతలు కృతనిశ్చయంతో ఉన్నారని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఇదే సమయంలో స్థానిక 15వ డివిజన్‌కు చెందిన కొమిరి పోసమ్మ మూడు రోజుల కుమార్తె ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ హాస్పిటల్‌లో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతుండగా ఆమె విజ్ఞప్తి మేరకు సిఎం సహాయ నిధి నుంచి రూ.2.50 లక్షల జారీ పత్రాన్ని అందించారు.

నేరాలు - ఘోరాలు

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - టి.నరసాపురం

అక్రమంగా నాటుసారా కలిగి ఉన్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చింతలపూడి ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని టి.నరసాపురం మండలం బంధంచర్ల గ్రామంలో శుక్రవారం ఎక్సైజ్ సిబ్బంది దాడులు చేశారు. ఈ దాడిలో నట్టా కల్యాణ్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి లీటర్ నాటుసారా స్వాధీనం చేసుకుని, 50 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

పేలుడు సంభవించే పదార్థాలు స్వాధీనం

మండవల్లి : పేలుళ్లు సంభవించే పదార్థాలు కలిగి ఉండడం చట్టరీత్యా నేరమని కైకలూరు రూరల్ సిఐ రవికుమార్ స్పష్టం చేశారు. ప్రత్తిపాటి స్టేజి వద్ద నివాసం ఉంటున్న నక్కల కుటుంబాల్లో శుక్రవారం సోదాలను నిర్వహించి కొద్ది మొత్తంలో పేలుడుకు సంబంధించిన నల్ల పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. పేలుడు పదార్థంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రామచంద్రరావు, విఆర్‌ఒ శ్యామలరావు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్ చోరీపై కేసు

టి.నరసాపురం : విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లలో కాపర్ వైర్ చోరీపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ఎం.జయబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 21వ తేదీన మండలంలోని రాజుపోతేపల్లి, తిరుమలదేవిపేట గ్రామ శివార్లలో రైతుల వ్యవసాయ భూముల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి వాటిలో కాపర్ వైరు చోరీకి పాల్పడ్డారు. విద్యుత్ ఎఇ దాసరి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేతివృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో చేతివృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోసం సెప్టెంబర్ ఒకటో తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు తెలిపారు. స్థానిక ఆర్ఆర్.పేటలోని చేతి వృత్తిదారుల జిల్లా కార్యాలయంలో చేతివృత్తిదారుల జిల్లా కమిటీ సమావేశం నగర సంఘం జిల్లా నాయకులు తాడిశెట్టి కాటమరాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ముందుగా ఇటీవల కాలంలో అనారోగ్యంతో, ప్రమాదవశాత్తు మృతి చెందిన వృత్తి సంఘాల నాయకులకు సమావేశం రెండు నిమిషాలు మౌనం పాటించి వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. అనంతరం ఆదిశేషు మాట్లాడుతూ వివిధ కార్పొరేషన్ల నుంచి వృత్తిదారులకు 90 శాతం రాయితీతో రుణాలు ఇవ్వాలని, కొన్ని వృత్తులలో ఉన్న ప్రజలకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, ఆదరణ పథకం-3లో వృత్తిదారులకు అధునాతనమైన పరికరాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో నగర సంక్షేమ సంఘం జిల్లా నాయకులు తాడిశెట్టి కాటంరాజు, బిసి జెఎసి నాయకులు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ బలోపేతానికి కృషి'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర ఒబిసి సెల్ ఛైర్మన్ శొంఠి నాగరాజు అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, బిసి సెల్ జిల్లా ఛైర్మన్ కట్ట నాగరాజ్ గౌడ్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన జిల్లా ఒబిసి కార్యవర్గం విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా రాష్ట్ర పర్యటనలో భాగంగా ఏలూరు వచ్చానని, ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి గ్రాఫ్ పెరిగిందని చెప్పారు. రానున్న కాలంలో కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలోకి తీసుకొచ్చే విధంగా ఒబిసిలు గణనీయంగా పాత్ర పోషించాలని కోరారు. ఏలూరులోని పడమర వీధి గాంధీ మైదానం వద్ద గాంధీ ఉప్పు సత్యాగ్రహం చేసి అరెస్టు అయి ఉప్పు పండించిన స్థలంలో స్థానిక జనసేన నాయకులు జనసేన పార్టీ లోగోను స్థూపాన్ని కట్టారని, ఆ స్థలాన్ని పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు జనసేన లోగోను అక్కడినుండి తీసివేయాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు మెమోరాండం అందించారు.

కారాగారం సందర్శన

ప్రజాశక్తి - చింతలపూడి

మండల న్యాయ సేవాధికార కమిటీ ఛైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు కారాగారాన్ని శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నిందితుల కేసు వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, అనారోగ్యంగా ఉన్నవారికి అందించే వైద్య సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. వంటశాల, స్టోర్ రూములను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపకారాగారా పర్యవేక్షణాధికారి కృపానందం, జైలు సిబ్బంది, ప్యానల్ లాయర్ జి.విజయరావు, పిఎల్‌విబి.నాగార్జునసాగర్ పాల్గొన్నారు.

పశువులకు ఎండు గడ్డి సాయం

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

రేపాకగొమ్ము, రుద్రంకోట, కోయిదా తదితర గ్రామాల్లోని పశువులకు మేత కొరత తీవ్రంగా ఉందని వరదల సమయంలో రైతుల ఆవేదనను తెలుసుకున్న యూరో స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో ఆకివీడుకు చెందిన జంపన కృష్ణంరాజుకు ఇక్కడ పరిస్థితులు తెలియజేశారు. ఆయన స్పందించి సోదరుడి కుమారుడి వరుణ్ వర్మ పుట్టినరోజు సందర్భంగా సహృదయంతో మూగజీవాల ఆకలి తెలుసుకుని రెండు లారీల ఎండు గడ్డిని పంపించారు. ఈ ఎండుగడ్డిని పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో పంపిణీ చేశారు.

ఎల్‌ఒసి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - ముసునూరు

నిరు పేదలకు మెరుగైన వైద్యం అందించడంలో సిఎం సహాయ నిధి అండగా నిలుస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. మండలంలో మూడు కుటుంబాలకు రూ.ఏడు లక్షల ఎల్‌ఒసి పత్రాలను ఆయన శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆధార్ మొబైల్ క్యాంపు

ప్రజాశక్తి - భీమడోలు

పొలసానిపల్లిలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులం(బాలికల) పాఠశాల, జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 23వ తేదీన ఆధార్ మొబైల్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంపిపి బివిఎస్‌వి.శర్మ తెలిపారు. పొలసానిపల్లి గ్రామ సచివాలయానికి చెందిన ఆధార్ మొబైల్ యూనిట్ ఆధ్వర్యంలో క్యాంపును నిర్వహించనున్నామన్నారు. దీనిలో ఆధార్ నమోదు, ఆధార్ నవీకరణ ఇతర సేవలు అందుబాటులో ఉంటాయని, సేవలను వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సమ్మె బాటలోకి సత్యసాయి కార్మికులు

బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్

170 గ్రామాలకు నిలిచిన తాగునీటి సరఫరా

ప్రజాశక్తి - పోలవరం


సమ్మెలో సత్యసాయి కార్మికులు

సత్యసాయి మంచినీటి కార్మికులు శుక్రవారం సమ్మె బాట పట్టారు. జీతాలు ఇవ్వకపోవడంతో పూట గడవని గడ్డు పరిస్థితుల్లో ఉద్యమ బాట పట్టామని చెబుతున్నారు. కార్మికుల ఆకలి కేకలు ప్రభుత్వానికి చేరేవరకూ నిరసన దీక్ష కొనసాగిస్తామన్నారు. జీతాల కోసం నాయకులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నా మా గోడు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 110 మంది సత్యసాయి మంచినీటి సరఫరా కార్మికులు తమకు పది నెలల జీతాల బకాయిలు చెల్లించాలని మండలంలోని కన్నాపురం అడ్డరోడ్డు వద్ద సమ్మెకు దిగారు. జీతాలు చెల్లించేవరకూ మంచి నీరు సరఫరా చేయబోమని చెప్పారు. జిఒ 11 ప్రకారం జీతాలు విడుదల చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి మంచినీటి సరఫరా కార్మికుల యూనియన్ అధ్యక్షులు శివశక్తి నారాయణ మాట్లాడుతూ ఇటీవల పాదయాత్రలో విద్యాశాఖ, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ తమను దత్తత తీసుకుని ఆదుకుంటామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. సత్యసాయి మంచినీటి ట్యాంకులపై ఆరు లక్షల మంది ఆధారపడి ఉన్నారని తెలిపారు. కార్మికుల సమ్మె వల్ల పోలవరం నుంచి నింతలపూడి వరకు నాలుగు నియోజకవర్గాల్లో సుమారు 170 గ్రామాలకు మంచినీటి సరఫరా నిలిచిపోయింది. కార్మికులకు సిపిఎం నాయకులు కారం భాస్కర్, సిపిఐ మండల కార్యదర్శి వెంకట నరసింహారావు సంఘీభావం తెలిపారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజలందరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ఆచరించేటట్లు వైద్య సిబ్బంది అందరూ విస్తృతంగా అవగాహన కల్పించాలని, అప్పుడే వర్షాకాలంలో సంభవించే సీజనల్ వ్యాధులు బారిన పడకుండా ఉండగలుగుతామని డిఎంహెచ్ఒ పిజె.అమృతం సూచించారు. స్థానిక వట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంబికా నగర్ ఆరో రోడ్డులో ప్రజలకు ఫ్రైడే డ్రైడే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. అనంతరం మురికి కాలువల్లో ఎబేట్ ద్రావణం పిచికారీ చేయించి దోమ లార్వాలను ప్రజలకు సోదాహరణగా చూపించారు. ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

కొయ్యలగూడెం : బయ్యన్నగూడెం ఎస్‌సి ఏరియాలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దోమల నివారణకు ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమ కాటు వల్ల డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధులు సంభవిస్తాయని, మురికినీటిలో, డ్రెయినేజీల్లో, నీటి నిల్వ కుంటల్లో దోమలు గుడ్లు పెట్టి విపరీతంగా పెరిగి మనుషులను వ్యాధులకు గురి చేస్తాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి ఎం.రవితేజ, హెల్త్ అసిస్టెంట్లు మోహన్, సుబ్బారావు, ఎఎన్ఎంలు డి.రాట్నాలమ్మ, ఎం.వనిత జ్యోతి, ఆశా కార్యకర్తలు శాంతకుమారి, జగతి పాల్గొన్నారు.

నూజివీడు డివైఇఒగా సుధాకర్ బాధ్యతల స్వీకరణ


డివైఇఒ సుధాకర్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు డివైఇఒగా డాక్టర్ పాతిబండ శ్రీకాంత్ సుధాకర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. చింతలపూడి ప్రభుత్వ హైస్కూల్‌లో హెచ్‌ఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్న సుధాకర్‌కు ఉన్నతాధికారులు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారన్నారు. ఇంతకుముందు పనిచేసిన ఎం.సేవియా ఉద్యోగ విరమణ చేయడంతో ఆస్థానం ఖాళీ అయింది. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లోని అభివృద్ధికి విద్యార్థుల పురోగతి కోసం కృషి చేస్తానని తెలిపారు. నూజివీడు సబ్ జోన్ వ్యాయామ ఉపాధ్యాయులు సుధాకర్‌ను ఘనంగా సన్మానించారు.

ముసునూరు : యుటిఎఫ్ మండలాధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.పద్మకిషోర్, గుడిమెళ్ల రాంబాబు ఆధ్వర్యంలో సుధాకర్‌ను ఘనంగా సత్కరించారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వెంకటేశ్వరరావు, గుడిపాడు ప్రధానోపాధ్యాయులు నాగబాబు, జిల్లా కార్యదర్శి బత్తుల అనురాధ, ఆడిట్ కమిటీ సభ్యులు కాసాని గాంగేయుడు, మండల సహా అధ్యక్షుడు పుల్లయ్య తదితరులు కలిసి అభినందించి సన్మానించారు.

ఘనంగా 'మానవత' ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


ఏలూరులో...

క్యాన్సర్ లక్షణాలను ముందుగా గుర్తించడం ద్వారా రోగికి చికిత్స సులభం అవుతుందని, వారిని ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చని ప్రముఖ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రవితేజ అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక వంగాయగూడెంలోని గుడ్ సమారిటన్ కేన్సర్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. మానవత సంస్థ చైర్ పర్సన్ అడుసుమిల్లి నిర్మల, విద్యానిధి ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, అధ్యక్షులు ఎంఎస్ఎంఎస్.కుమార్ మాట్లాడారు.

భీమడోలు : మానవత స్వచ్ఛంద సంస్థ భీమడోలు శాఖ ఆధ్వర్యంలో సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వారోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో భాగంగా కేంద్ర కమిటీ సభ్యులు రామిశెట్టి గంగాధరరావు, శాఖ అధ్యక్షులు అల్లాడ ప్రసాదరావు ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాన్ని మానవత డైరెక్టర్ బంటు విజయకుమార్ ప్రారంభించారు. మరొక డైరెక్టర్ దాట్ల రామకృష్ణరాజుతో పాటు, భీమడోలు మాజీ ఎంపిపి సిరిబత్తిన కొండబాబు పాల్గొన్నారు. పొలసానిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి షేక్ రహీమా బేగం హసేన, పారిశ్రామిక వేత్త షేక్ హసేన సహాయ సహకారాలతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు.

మండవల్లి : మానవత సేవలను మరింత విస్తృతం చేసి సాయం అందించేలా ప్రతిఒక్కరూ సహకరించాలని సంస్థ అధ్యక్షులు గుడివాడ విజయ గణేష్ కోరారు. సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగేంద్ర స్వామి మంటపం నుంచి స్టేషన్ రోడ్డు వరకు శాంతిర్యాలి నిర్వహించి అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలను నాటారు.

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం శాఖ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మానవత జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణ, యూనియన్ బ్యాంక్ మేనేజర్ ప్రారంభించారు.

ఇళ్ల స్థలాల కోసం స్థల పరిశీలన

ప్రజాశక్తి - ముసునూరు

అర్హులందరికీ ప్రభుత్వం ఇంటి స్థలం మంజూరు చేస్తుందని తహశీల్దార్ డి.ప్రశాంతి చెప్పారు. రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఆదేశాల మేరకు ఇళ్ల స్థలాల కోసం మండలంలోని వేల్పుచర్లలో ఏనుగు గుట్ట ప్రాంతాన్ని శుక్రవారం పరిశీలించారు. పేదలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించనున్నట్లు తహశీల్దార్ తెలిపారు. పరిశీలించినవారిలో విఆర్‌ఒ నవీన్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసచౌదరి, టిడిపి మండలాధ్యక్షులు గద్దే రఘుబాబు, టిడిపి నాయకులు తుమ్మల నాగేశ్వరరావు, అబ్బినేని రాంబాబు, గరికిముక్కు నాని, త్రిమూర్తులు, అశోక్, రాజు, యేసురత్నం, గ్రామస్తులు ఉన్నారు.

'శాంతిభద్రతలకు అబ్బయ్యచౌదరి విఘాతం'

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రజలకు చేరువలో లేకుండా విదేశాల్లో ఉంటూ కొంతమంది రౌడీషీటర్లను, బౌన్సర్లను కిరాయికి కుదిరించి గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా ప్రవర్తించిన మాజీ ఎంఎల్‌ఎ అబ్బయ్య చౌదరిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు ఎస్‌పిని కోరినట్లు చెప్పారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో చింతమనేని శుక్రవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లు దొంగతనానికి గురైతే దానికి కారణం మమ్మల్ని చేస్తే ఇదేం న్యాయమని ప్రశ్నించారు. గ్రామాల్లో అలజడులు, కుట్రలు చేసేందుకు ప్రయత్నిస్తే ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు.

'ప్రజాస్వామ్యబద్ధంగా నడుచుకోని చింతమనేని'

ఏలూరు స్పోర్ట్స్ : మాజీ ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్య చౌదరి ఇంటివద్ద దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అరాచకం, దౌర్జన్యాలు చేయడం తగదని వైసిపి నేత, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ అన్నారు. చింతమనేని ప్రభాకర్ ప్రజాస్వామ్య బద్ధంగా నడుచుకోవడంలేదని ఎస్‌పికి వారు ఫిర్యాదు చేశారు. అనంతరం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ టిడిపి నేతలు కుట్రలు, కుతంత్రాలతో రాజకీయాలు చేద్దామంటే సరైన పద్ధతి కాదన్నారు. రాజ్యాంగాన్ని, చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నా వైసిపి కార్యకర్తలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. మాజీ మంత్రి పేర్నినాని మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గంలో టిడిపి నేతల దౌర్జన్యకాండ జిల్లా వాసులు, రాష్ట్రంలోని ప్రజలు చూశారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నేతలు పాల్గొన్నారు.

'డ్రగ్స్ వద్దు బ్రో'

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎఎస్‌పి సూర్యచంద్రరావు సూచి ంచారు. నగరంలోని సర్ సిఆర్ఆర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల నాడి వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుందన్నారు. మత్తుపదార్థాలు అమ్మే వారి వివరాలను 1972 నెంబర్‌కు తెలియజేయాలన్నారు.